క్లుప్తంగా

నవోదయలో సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ



రాజుపాలెం: మండలకేంద్రంలోని నవోదయ ఇంగ్లిష్ మీడియం (ప్రభుత్వ గుర్తింపు)పాఠశాలలో నూతన సరస్వతీదేవి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. పూజారులు అనంతాచార్యులు, చెన్నకేశవచార్యులు హోమం నిర్వహించి ప్రిన్సిపాల్ ప్రత్తి రామారావు దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పాఠశాల డైరెక్టర్లు ప్రత్తి హనుమంతరావు, ప్రత్తి శ్రీనివాసరావు, ప్రత్తి జీవన్‌రావులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్వామిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



నకరికలు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని డాక్టర్ షేక్ హసీనా పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు నెలవారీ వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తశాతం, షుగరు, బీపీ, బరువు తదితర పరీక్షలు చేశారు. అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆట్యా-పాట్యా జాతీయస్థాయి పోటీలకు నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: ఆట్యా-పాట్యా క్రీడలో రాష్ట్రజట్టుకు ఎంపికై న క్రీడాకారులు జాతీయ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు పి.మల్లికార్జునరావు, కె.వెంకట వరుణ్‌సందేశ్, ఎల్.లక్ష్మీ ప్రసన్న, షేక్ నజ్మాలు ఆట్యా-పాట్యా క్రీడలో రాష్ట్రజట్టుకు ఎంపికై ఈనెల 11 నుంచి 13వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆడేందుకు బుధవారం బయలుదేరారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కె.నగేష్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సత్తెనపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ రాజ్ శాఖ అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, జరగబోయే అభివృద్ధిపై చర్చించి మాట్లాడారు. సమావేశంలో పంచాయతీరాజ్ అధికారులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 125 దరఖాస్తులు

క్రోసూరు: క్రోసూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం షాపుల నిర్వహణకు 125 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ టి.తులసి బుధవారం తెలిపారు. ఈనెల 11 వరకు దరఖాస్తులు తీసుకుంటామని, 14వ తేదీన నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ లాటరీ తీస్తారని తెలిపారు. క్రోసూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు కలిపి మొత్తం 10 షాపులకు దరఖాస్తులను ఆహ్వానించటం జరిగిందన్నారు.

వైభవంగా చండీహోమం



చిలకలూరిపేట: ఆశ్వయుజ శుద్ధ సప్తమి, సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గంగా పార్వ తీ సమేత ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవి ఆలంకారంగావించారు.

గత స్మృతి ఘనం..నేడు అధ్వానం

ఉద్యానహీనంగా వావిలాల స్మృతివనం

- ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు
- స్మృతివనంలో కనిపించని ఓపెన్ ఆడిటోరియం
- పాములు, విష పురుగుల సంచారానికి ఆవాసం
- పట్టించుకోని పాలకులు, మున్సిపల్ అధికారులు



వావిలాల స్మృతివనం ముఖద్వారం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రజలకు మానసిక ప్రశాంతత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు 2019లో రూ.12 కోట్ల నిధులు వెచ్చించి వావిలాల స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. శారీరక, మానసిక ప్రశాంతత, ఉల్లాసం పొందేందుకు వ్యాయామం, నడక, యోగా, ధ్యానం చేసేందుకు పిల్లలు, పెద్దలు ఇక్కడికి వస్తుంటారు. స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య పేరుతో ఏర్పాటు చేసిన వావిలాల స్మృతి వనం ఎంతోమందికి ఆహ్లాదం పంచుతుంది. ఇలాంటి స్మృతి వనాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఆడుకునేందుకు వచ్చే పిల్లలు, వ్యాయామం కోసం వచ్చే యువకులు, పెద్దలు నిర్లక్ష్యానికి గురైన స్మృతివనాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో స్మృతి వనంలో గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. స్మృతి వనంలోకి పాములు, విషపురుగులు సైతం సంచరిస్తున్నాయి. స్మృతి వనంలోని ఓపెన్ ఆడిటోరియం కనిపించకుండా అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరిగాయి.

విస్మరించిన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వావిలాల స్మృతి వనానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు నిత్యం వావిలాల స్మృతి వనాన్ని సందర్శించడం, ప్రతిరోజూ తారక రామాసాగర్ వాకింగ్ ట్రాక్ పై నడవడంతో మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు స్మృతి వనం నిర్వహణపై దృష్టి సారించేవారు. ఏ మాత్రం గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు చూసేవారు. దీంతో స్మృతి వనానికి వచ్చే పిల్లలు, మహిళలు, పెద్దల సంఖ్య పెరిగి సందడిగా ఉండేది. స్మృతి వనం అభివృద్ధి, నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వం స్మృతి వనం అభివృద్ధిని విస్మరించింది. వావిలాల స్మృతి వనానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.

మందుబాబులకు అడ్డాగా...

వావిలాల స్మృతి వనాన్ని పట్టించుకోక పోవడంతో కొందరు మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఉద్యోగులు, మహిళలు సాయంత్రం పూట స్మృతివనం, తారక రామాసాగర్ చుట్టూ వాకింగ్ చేసేందుకు వస్తుంటారు. కొందరు మందుబాబులు మద్యం మత్తులో సీసాలను స్మృతి వనం సమీపంలో తారకరామా సాగర్‌లోకి విసరడం, మరికొందరు స్మృతి వనంలోని బల్లల పై కూర్చొని మద్యం మత్తులో ఊగుతూ కనిపిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగుతారనే భయంతో స్మృతి వనానికి రావాలంటే కొందరు భయపడుతున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న పట్టణంలోని స్మృతి వనం



అధ్వానంగా ఓపెన్ ఆడిటోరియం

స్మృతి వనం అభివృద్ధికి చర్యలు



పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో కొంతమేర గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం వావిలాల స్మృతి వనం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను కట్ చేయిస్తున్నాం. 13 మంది కార్మికులను స్మృతివనానికి కేటాయించాం. స్మృతి వనం నిర్వహణలో భాగంగా జీతాలు, తదితర వాటికి ప్రతి నెలా రూ. 2 లక్షలు ఖర్చు చేయడం జరుగుతోంది. పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంది. ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

-కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులలో అధికారులు గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందితో సమన్వయం చేసుకుని అడిగినవారికి పని కల్పించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజావేదికలో పీడీ బూసిరెడ్డి గ్రామాల వారిగా సామాజిక తనిఖీల నివేదికలను సమీక్షించారు. ఈసందర్భంగా బూసిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1359 పనులు పూర్తిచేశామని అందుకోసం రూ.7,13,20,003లు ఖర్చుచేశామన్నారు. ఉపాధి హామీ వేతనాల కింద రూ.5,66,44,979లు చెల్లించామని, మెటీరియల్ కింద రూ.1,56,0003లు, పంచాయతీరాజ్ పనులకు రూ.1,46,71,894లు చెల్లించామన్నారు. ఈఏడాది 2.26లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 2.36లక్షల పనిదినాలను పూర్తిచేశామన్నారు. ఇటీవల వరదల కారణంగా ఉద్యానశాఖ ద్వారా నాటిన మొక్కలు చనిపోవటంతో వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటించాలన్నారు. ఏపీఓ విజయకుమారి, ఎండీఓ మాధవి, ఎంపీఓ జి.శుభావతితో పాటుగా వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రిసోర్స్ పర్సన్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు కృషి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



పంచాయతీరాజ్ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం కట్టమూరి నరసింహం పేరుతో జిల్లా పరిషత్ స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో 2,500 ఎకరాల జిల్లా పరిషత్తు భూములు ఉన్నాయని, వాటిని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు.

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో భూముల పరిరక్షణతో పాటు అభివృద్ధి చేస్తామన్నారు. స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో గెస్ట్‌హౌస్ నిర్మించారని తెలిపారు. కాగా మరో రూ.30 లక్షలు గెస్ట్‌హౌస్‌కు కేటాయించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ కోరగా త్వరగా ప్రతిపాదనలు తయారు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో పంచాయతీరాజ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ స్థలదాత కట్టమూరి నరసింహం పేరు మీద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీ రాజ్ డీఈ శేఖర్‌బాబు, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, న్యాయవాది పూజల వెంకట కోటయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. గ్రామగ్రామాల్లో ఉన్న వివిధ ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సత్తెనపల్లి/అచ్చం పేట/క్రోసూరు/ముప్పాళ్ళ/బెల్లంకొండ/నకరికల్లు/రాజుపాలెం



సత్తెనపల్లిలో సరస్వతీదేవిగా వాసవీ మాత



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గాపీఠంలో సరస్వతీ దేవిగా..



సత్తెనపల్లి వెంకటపతి కాలనీలో సరస్వతీ దేవిగా



ఇనమెట్లలోని సరస్వతీ దేవిగా కనకదుర్గ



నర్సింగపాడులో మహా సరస్వతి అలంకారంలో..



బెల్లంకొండలో సరస్వతీ దేవిగా మహాలక్ష్మి



సరస్వతీదేవిగా క్రోసూరు వాసవీ అమ్మవారు



అచ్చంపేటలో సరస్వతీదేవిగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి



సత్తెనపల్లి శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో..



లంకెలకూరపాడులో శ్రీసరస్వతీదేవి అలంకారంలో

అక్రమంగా వేసిన షెడ్లను తొలగించాలి

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆటో పాయింట్ స్థలంలో అక్రమంగా వేసిన షెడ్లను వెంటనే తొలగించాలని చేయూత ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు ఎం.హరిపోతురాజు డిమాండ్ చేశారు. చేయూత ట్రాలీ ఆటోవర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 నుంచి ఆటో కార్మికులు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆటో పాయింట్‌లో వాహనాలు నిలుపుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. 40 మంది కార్మికులు ఈ ఆటో పాయింట్‌లో సభ్యులుగా ఉన్నారని, ఇప్పటికే ఉన్న స్థలం సరిపోకపోగా రోడ్డు వెంబడి స్థలం కావడంతో వివిధ రకాల వ్యాపారులు ఆ స్థలంపై కన్నేసి ఆక్రమణలు చేస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకుల అండదండలతోనే మేము ఈ షెడ్లు వేస్తున్నామని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా గ్రంథాలయం ఉన్న స్థలం దగ్గర పాయింట్ ఏర్పాటు చేసుకున్నామని, ఆ తర్వాత మెయిన్ రోడ్ లో ఉన్నటువంటి లూథరన్ చర్చి దగ్గరకు ఆటో పాయింటు మార్చమంటే మార్చామన్నారు. అక్కడి నుంచి చర్చి కమిటీ సభ్యులతో ఇబ్బందులు ఏర్పడితే ఆర్ అండ్ బీ బంగ్లా దగ్గరకి ఆటో పాయింటు మార్చడం జరిగిందన్నారు. 2019 నుంచి ఇక్కడే ఆటోలు పార్కింగ్ చేసుకుంటూ ఆటో కార్మికులంతా జీవనం కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే కన్నాకు కార్మికులు సమస్యను వివరించారు. అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి ఆటో పాయింట్ల అక్రమించుకొని వ్యాపారాలు కొనసాగించటం సరైనది కాదని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు కోరారు. యూనియన్ అధ్యక్షుడు నాని రాజేంద్ర, కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి చిన్న మల్లయ్య, కమిటీ సభ్యులు టి.వెంకట్రావు, ఇమ్మానుయేలు, ఎస్.శ్రీనివాసరావు, పల్నాటి వెంకటేశ్వర్లు, బి.వీర్రాజు, ఆర్.కాశయ్య, ఎ.రాము, సింగడి సైదేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈగా శేషప్పయ్య

బెల్లంకొండ: మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈగా శేషప్పయ్య బాధ్యతలు స్వీకరించారు. అచ్చంపేట మండలంలో విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బెల్లంకొండకు వచ్చారు. పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని ఏఈ తెలిపారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా బి.నాగరాజు బదిలీపై వచ్చి, విధుల్లో చేరారు.

కొనసాగుతున్న 'పొలం పిలుస్తోంది'



రాజుపాలెం రైతుసేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి నవీన్

రాజుపాలెం: మిరప పంట వేసే రైతులు నారు నాటేటప్పుడు వేరుకుళ్లు రాకుండా నాటే ముందుగా ఎకరానికి రెండు నుంచి మూడు బస్తాల వేపపిండి దుక్కిలో వేసుకోవాలని, అలాగే మొక్కలు నాటే ముందు కోర్బెండోజియమ్ ద్రావణంలో ముంచి నారు వేసుకోవాలని ఉద్యాన అధికారి డి.నవీన్ తెలిపారు. మండలంలోని గణపవరం, కొత్తపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ శివకుమారి, ఎంపీవో జె.వెంకయ్య, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాదల(ముప్పాళ్ళ): వరిలో సుడిదోమ, ఆకుచుట్ట పురుగు నివారణ నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. పశువైద్యులు పుల్లారెడ్డి, ఏఈఓలు కే.నరేష్, బి.వెంకటనారాయణ, ఇన్‌చార్జ్ సర్పంచ్ టి.సైదుబాబు, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు: రైతు పేరున పంట నమోదు అయి ఉంటేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తారని ఏఓ వేణుగోపాల్ అన్నారు. బుధవారం హసనాబాద్, గాదేవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏఓ మాట్లాడుతూ ఈ-పంట నమోదు నకు సంబంధించి రైతు ఈ-కేవైసీ ఆవశ్యకత గురించి వివరించారు. రైతుసేవ కేంద్ర సిబ్బంది రుబియా బేగం (హసనాబాద్), ఖాజా మొయినుద్దీన్ (గుడిపాడు) వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: పత్తిలో రసం పీల్చుపురుగు, గులాబీ రంగు పురుగుల యాజమాన్యం పద్ధతులు, మినుములో ఇనుప ధాతు లోప నివారణకు అన్నభేది ఐదు గ్రాములు, నిమ్మ ఉప్పు 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి రైతులకు తెలిపారు. బలుసుపాడు, 75త్యాళ్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నకరికల్లు: అధికారుల సిఫారసు మేరకే ఎరువులను వినియోగిస్తే తక్కువ పెట్టుబడిలో గణనీయమైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎంఐ టెక్నికల్ ఆఫీసర్ మోషేనాయక్, సర్పంచ్ నాగోతు దాసయ్య, ఎంపీఓ కె.హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: ప్రత్తి పంటలో పచ్చదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అయ్యప్ప, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై అవగాహన అవసరం

- సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి
- ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం



శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు పంచాయతీ పాలనపై అవగాహన పెంచుకోవాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ల, పాకాలపాడు, ఫణిదం, కంకణాలపల్లి, ధూళిపాళ్ల, భృగుబండ, కందులవారిపాలెం, గోగులపాడు గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, ఆయా పంచాయతీల నుంచి ఎంపికైన ఇరువురు వార్డు సభ్యులకు చేపట్టిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ముందుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి శిక్షణా తరగతులను ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృష్ట్యా గ్రామాల్లో పరిశుభ్రత కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్ చట్టం, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల విస్తరణ అధికారి అన్నపురెడ్డి శ్రీని వాసరెడ్డి, కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రాజుపాలెం: పంచాయతీలలో మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పంచాయతీల ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటిపన్నులు వసూలు చేసి పంచాయతీ ఆదాయాలను పెంచుకోవాలని తెలిపారు. ఎంఈఓ మల్లిఖార్జునశర్మ, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నకరికల్లు: గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులు విధులు, విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జి.కాశయ్య అన్నారు. మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు తాగునీటి నిర్వహణ, భవనాల ప్లానింగ్, వీధిదీపాల నిర్వహణ, నిధుల నిర్వహణ, కోర్టు కేసులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. టీఓటీలు కె.అప్పారావు, నర్రా మమత పాల్గొన్నారు.

బెల్లంకొండ: స్వచ్ఛ గ్రామ పంచాయతీలే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు పనిచేయాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు, పంచాయతీకి ఇద్దరు చొప్పున ఎంపికైన వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈఓపీఆర్డీ బి.వెంకటరెడ్డి, వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బురదకయ్యగా రహదారి



కాలనీలో రోడ్డు దుస్థితి

అచ్చంపేట: ఎన్నికల ముందు కూటమి నేతలు పక్కారోడ్లు వేయిస్తామన్నారు.. వేయించలేదు. సైడు కాలువలు నిర్మిస్తామన్నారు.. అదీలేదు. సైడ్ కాలువలు లేకపోవడంతో సిస్టన్ ట్యాంక్ నుంచి వచ్చే నీళ్లు, ఇళ్లలో వాడుకునే నీళ్లు మొత్తం కలిసి రోడ్డుపైకి వచ్చి బురదగా మారుతోంది. ఇది నిత్యకృత్యమే. ఇక వర్షం పడితే సరేసరి. మూడు నాలుగు రోజులపాటు గిలకల లోతు నీళ్లు నిలబడతాయి. ఇదీ స్థానిక చామర్రు రోడ్డులోని వీరభద్రస్వామి కాలనీలో దుస్థితి. ఇక్కడ సుమారు 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. అంతర్గత రహదారులు గానీ, సైడ్ డ్రైన్స్‌గానీ లేవు. వర్షం పడితే బురదలో నడుచుకుంటూ వెళ్లాలి. ఇటీవల భారీవర్షాల సమయంలో స్వయంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఈ ప్రాంతాన్ని దర్శించి, దుస్థితిని చూసి వెంటనే చర్యలు చేపట్టమని అధికారులను ఆదేశించారు కూడా.. అయితే ఇంతవరకు అతీగతి లేదు. నడిచేందుకు కూడా వీలు లేక అల్లాడిపోతున్నాం. కనీసం ఒక ట్రక్కు మట్టయినా పోయించండంటూ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.